# దిక్సూచి



## సివిల్స్ / గ్రూప్- 1, 2 - జేఎల్ / డీఎల్ గైడెన్స్



బి. కృష్ణారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్

# ఇండియన్ పాలిటీ మేడ్ ఈజీ

### కొత్త ప్రకరణలు, సవరించిన అంశాలు

ఇండియన్ పాలిటీలో అత్యంత ముఖ్యమైన, ప్రాథమికమైన అంశాలు ప్రకరణలు. వీటి నుంచి 5 -8 ప్రశ్నలు వస్తున్నాయి. వందల సంఖ్యలో ఉన్న ప్రకరణలను కంఠస్తం చేసి గుర్తుంచుకోవడం కష్టసాధ్యమే. అయినా అన్నీ గుర్తుంచుకొనే ప్రయత్నం సహేతుకం కాదు, అనవసరం కూడా. గత వారంలో కొన్ని ముఖ్య నిబంధనలకు సంబంధించి మెమొరీ టిప్స్ అందించాం. ఈ పర్యాయం పరీక్ష రీత్యా తప్పనిసరిగా వచ్చే అవకాశమున్న కొత్తగా చేర్చిన ప్రకరణలు వాటి ముఖ్యాంశాలను క్రమపద్ధతిలో పొందుపరిచాం. కొత్త ప్రకరణ చేర్చాలన్నా, ఉన్న ప్రకరణలోని అంశాలను సవరించాలన్నా రాజ్యాంగ సవరణ తప్పనిసరి. కాబట్టి అభ్యర్థులు ప్రకరణంలోని ముఖ్యాంశాలతో పాటు సంబంధిత రాజ్యాంగ సవరణ, సంవత్సరం కూడా గుర్తుంచుకోవాలి.

ప్రకరణ: **13 క్లాజ్-4**

**సవరించిన/చేర్చిన అంశం:** ప్రకరణ 368 ప్రకారం చేసిన రాజ్యాంగ సవరణ నిబంధన 13లోని 'చట్టం' అనే పరిధిలోకి రాదు.
**రాజ్యాంగ సవరణ:** 24వ సవరణ, 1971
**ప్రత్యేకత:** ప్రకరణ 13లో 'చట్టం' అనే పదాన్ని నిర్వచించారు. చట్టం అనగా ఆర్డినెన్స్, ఆర్డర్, రూల్ రెగ్యులేషన్, నోటిఫికేషన్, ఆచార, వ్యవహారాలు. కాని రాజ్యాంగ సవరణ 'చట్టం' అనే పరిధిలోంచి మినహాయించారు.

ప్రకరణ: **16 (4ఎ).**

**సవరించిన/చేర్చిన అంశం:** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించారు.
**రాజ్యాంగ సవరణ:** 77వ సవరణ, 1995.
**ప్రత్యేకత:** ఈ సవరణ ద్వారా గతంలో సుప్రీంకోర్టు పదోన్నతుల్లో రిజర్వేషన్లు చెల్లవు అనేది చెల్లుబాటు కాదు.

ప్రకరణ: **21ఎ.**

**సవరించిన/చేర్చిన అంశం:** 14 సంవత్సరాల లోపు ఉన్న బాలలకు ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య.
**రాజ్యాంగ సవరణ:** 86వ సవరణ, 2002.
**ప్రత్యేకత:** ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించారు.

ప్రకరణ: **31 ఎ, 31బి**

**సవరించిన/చేర్చిన అంశం:** ప్రజా ప్రయోజనార్థం ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, నియంత్రించడం. సంబంధిత చట్టాలకు మినహాయింపులు - భూసంస్కరణలు.
**రాజ్యాంగ సవరణ:** మొదటి రాజ్యాంగ సవరణ, 1951
**ప్రత్యేకత:** ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ను చేర్చి అందులో భూసంస్కరణ చట్టాలను పొందుపరచి, న్యాయసమీక్ష నుంచి మినహాయించారు.
**ప్రత్యేకత:** సంక్షేమ నియమం.

ప్రకరణ: **43ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** కార్మికులకు పరిశ్రమల నిర్వహణలో భాగస్వామ్యం.
**రాజ్యాంగ సవరణ:** 42వ సవరణ, 1976
**ప్రత్యేకత:** సంక్షేమ నియమం.

ప్రకరణ: **48ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** పర్యావరణ పరిరక్షణ, వన్య ప్రాణి సంరక్షణ.
**రాజ్యాంగ సవరణ:** 42వ సవరణ, 1976
**ప్రత్యేకత:** ఉదారవాద నియమం.

ప్రకరణ: **51ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** ప్రాథమిక విధులు
**రాజ్యాంగ సవరణ:** 42వ సవరణ, 1976
**ప్రత్యేకత:** ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఇవి 1977, జనవరి 3 నుంచి అమలులోకి వచ్చాయి.

ప్రకరణ: **51ఎ క్లాస్ (కె)**

**సవరించిన/చేర్చిన అంశం:** తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలకు విద్యావకాశాలు కల్పించాలి. (14 సంవత్సరాల లోపల గల బాలలకు).
**రాజ్యాంగ సవరణ:** 86వ సవరణ, 2002

ఇది రాజ్యాంగానికి చేసిన మొదటి సవరణ.

ప్రకరణ: **31 సి**

**సవరించిన/చేర్చిన అంశం:** ప్రాథమిక హక్కు అయిన ఆస్తిహక్కుపై పరిమితులు విధించారు. నిర్దేశక నియమాల్లోని 39(బి) లేదా (సి) అమలు చేయడానికి ఆస్తిహక్కుపై పరిమితులు విధిస్తే అవి రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానంలో ప్రశ్నించ కూడదు.
**రాజ్యాంగ సవరణ:** 25వ సవరణ, 1971
**ప్రత్యేకత:** నిర్దేశక నియమాలకు ప్రాధాన్యం పెరిగింది. సుప్రీంకోర్టు న్యాయ సమీక్షా అధికారాన్ని పరిమితం చేశారు.

ప్రకరణ: **39 (ఎఫ్) (క్లాస్)**

**సవరించిన/చేర్చిన అంశం:** బాలలు ఆరోగ్యంగా ఎదగడానికి అవసరమైన పరిస్థితులను కల్పించడం. నైతిక, భౌతిక దోపిడీ నుంచి రక్షణ.
**రాజ్యాంగ సవరణ:** 42వ సవరణ, 1976
**ప్రత్యేకత:** బాలలు ప్రత్యేక వసతులు.

ప్రకరణ: **39(ఎ)**

**సవరించిన/చేర్చిన అంశం:** సమాన న్యాయం. ఉచిత న్యాయ సలహా.
**రాజ్యాంగ సవరణ:** 42వ సవరణ, 1976

ప్రకరణ: **134ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** హైకోర్టు తీర్పులను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోవడానికి హైకోర్టు ఇచ్చే ధృవీకరణలు.
**రాజ్యాంగ సవరణ:** 44వ సవరణ 1978
**ప్రత్యేకత:** అనవసర అప్పీళ్లను నియంత్రించడం.

ప్రకరణ: **139ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** ఒకటి లేదా ఎక్కువ హైకోర్టులలో విచారణలో ఉన్న ఒకేరకమైన వివాదాలను సుప్రీంకోర్టుకు బదిలీ చేయడం.
**రాజ్యాంగ సవరణ:** 44వ సవరణ, 1978

ప్రకరణ: **224ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులను హైకోర్టుల్లో వినియోగించుకోవడం.
**రాజ్యాంగ సవరణ:** 15వ సవరణ, 1963

ప్రకరణ: **233ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** జిల్లా న్యాయమూర్తుల నియామక ధృవీకరణ, తీర్పులకు సంబంధించినది.
**రాజ్యాంగ సవరణ:** 20వ సవరణ, 1966

ప్రకరణ: **239ఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతానికి స్థానిక శాసనసభ, మంత్రిమండలి, ముఖ్యమంత్రి ఏర్పాటు అలాగే పాండిచ్చేరికి కూడా శాసనసభ, మంత్రి మండలి, ముఖ్యమంత్రి ఏర్పాటు.
**రాజ్యాంగ సవరణ:** 14వ సవరణ, 1962
**ప్రత్యేకత:** శాసనసభ, మంత్రిమండలి ఉన్న రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఢిల్లీ, పాండిచ్చేరి మాత్రమే. ఈ శాసన సభ్యులకు రాష్ట్రపతి ఎన్నికలో కూడా స్థానం కల్పించారు. (70వ రాజ్యాంగ సవరణ, 1992లో)

ప్రకరణ: **239ఎఎ**

**సవరించిన/చేర్చిన అంశం:** కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి ప్రత్యేక అధికరణ. ఢిల్లీని 'నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్'గా పేరు మార్పు. దీని అధిపతిని లెఫ్టినెంట్ జనరల్ అంటారు. ఢిల్లీ ముఖ్యమంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు.
**రాజ్యాంగ సవరణ:** 69వ సవరణ, 1991

(మిగతా వచ్చేవారం)

# బీఎస్ఎన్ఎల్‌లో జేఏఓ పోస్టులు

**భా**రత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 'జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్' (జేఏఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా వెయ్యి పోస్టులను భర్తీ చేయనుంది. పోస్టులను రాత పరీక్ష ద్వారా భర్తీ చేసేందుకు నిర్ణయించింది. సంబంధిత పరీక్షను 2010 ఫిబ్రవరి లేదా మార్చిలో నిర్వహిస్తారు. కచ్చితమైన తేదీలను ఇంకా నిర్ణయించలేదు.

వెయ్యి పోస్టులకు గానూ, ఓసీలకు- 453, ఓబీసీలకు-253, ఎస్సీలకు- 195, ఎస్టీలకు- 99 ఖాళీలను కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్‌లకు అనుగుణంగా ఇంకా వికలాంగులకు మూడు శాతం కేటాయించారు.

### పే స్కేలు

ఎంపికైన అభ్యర్థులకు 16400-40500 వేతన శ్రేణిని నిర్ణయిస్తారు. మూల వేతనంపై వార్షికంగా మూడు శాతం ఇంక్రిమెంట్లను అమలు చేస్తారు. బీఎస్ఎన్ఎల్ నియమ నిబంధనలను అనుసరించి హెచ్ఆర్ఏ, పెర్క్స్, మెడికల్ బెనిఫిట్స్, ఎల్టీసీ తదితరాలను వర్తింపజేస్తారు.

### అర్హతలు

**జాతీయత:** భారతీయులు మాత్రమే దరకాస్తు చేసేందుకు అర్హులు.
**విద్యార్హతలు:** అభ్యర్థులు 31-12-2009 నాటికి కింద పేర్కొన్న ఏదేనీ అర్హతను తప్పనిసరిగా కలిగి ఉండాలి.

1. చార్టర్డ్ అకౌంటెంట్
2. కంపెనీ సెక్రటరీ
3. కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్
4. ఎం.కాం (మాస్టర్ ఆఫ్ కామర్స్)

అభ్యర్థులు ఆయా అర్హతలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా/ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అండ్ వర్క్స్ అకౌంటెంట్స్ అఫ్ ఇండియా (1, 2, 3 అర్హతలకు సంబంధించి) నుంచి పొంది ఉండాలి. ఎం.కాం (4) సంబంధించి ఏదేని గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి అర్హత సాధించాలి.

**గమనిక:** పరీక్షకు హాజరు కావడం కేవలం తాత్కాలిక ప్రాతిపదికపైన మాత్రమే..సర్టిఫికేట్ల వెరిఫికేషన్ సమయంలో తప్పనిసరిగా ఒరిజినల్స్ చూపించాలి. లేని పక్షంలో వారు అనర్హతకు గురవుతారు.

### జాబ్స్ రిమైండర్

### వయసు

అభ్యర్థులు 2010 జనవరి 1 నాటికి ఇరవై సంవత్సరాలకు తక్కువ కాకుండా, 30 సంవత్సరాలకు మించకుండా ఉండాలి. కింది వారికి నిబంధనలను అనసరించి వయో సడలింపులు ఉంటాయి.

1. ఎస్సీ- ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు.
2. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు.
3. వికలాంగులకు 10 ఏళ్లు. (ఎస్సీ- ఎస్టీలకు 15 ఏళ్లు, ఓబీసీలకు 13 ఏళ్లు)
4. మాజీ సైనికోద్యోగులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి..
5. మహిళలకు అయిదేళ్లు.
6. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు అయిదేళ్లు.

అభ్యర్థుల వయో నిర్ధారణకు పదో తరగతి సర్టిఫికేట్‌లోని పుట్టిన తేదీనే ప్రామాణికంగా పరిగణిస్తారు.

### ఎంపిక విధానం

దేశ వ్యాప్తంగా జరిగే పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి.

1. జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్
2. ఫైనాన్షియల్ అండ్ కమర్షియల్ అకౌంట్స్

### దరఖాస్తు విధానం

అభ్యర్థులు బీఎస్ఎన్ఎల్ వెబ్ సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు 1000 రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ 'అకౌంట్స్ ఆఫీసర్, సీజీఎం, ఎన్‌టిఆర్, న్యూఢిల్లీ' పేరిట తీసి జతచేసి, పూర్తి చేసిన దరఖాస్తులను కింది చిరునామాకు పంపించాలి.

**ది డీజీఎం (అడ్మినిస్ట్రేషన్), ఆఫీస్ ఆఫ్ సీజీఎం (ఎంటీసీఈ),**
**బీఎస్ఎన్ఎల్, నార్తర్న్ టెలికాం రీజియన్, రూం నంబర్ 257,**
**2వ అంతస్తు, కిద్వాయ్ భవన్, న్యూఢిల్లీ-110001**
**పూర్తి చేసిన దరఖాస్తులను పంపించేందుకు చివరి తేదీ:**
29-12-2009
వెబ్‌సైట్: www.bsnl.co.in

# జ్ఞాపక శక్తి సాధ్యమే

### మెమరీ టిప్స్



**జ్ఞా**పక శక్తి అనేది ప్రత్యేకంగా ఉండదు. మెదడు సక్రమంగా ఉంటే జ్ఞాపకశక్తి దానికదే పని చేస్తుంది. మంచి అలవాట్లు మెదడును చురుగ్గా ఉంచుతాయి. కంటి నిండా నిద్ర, వేళకు భోజనం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం మూలంగా ఆశించిన ఫలితాలు రాబట్టుకోవచ్చు.

**శ్రద్ధ ముఖ్యం:** ఏదైనా సమాచారాన్ని మస్తిష్కంలో నిక్షిప్తం చేసుకొనేందుకు చక్కటి మార్గం..దానిపై శ్రద్ధ చూపించడమే! ఏదైనా విషయాన్ని పునఃశ్చరణ చేసుకోవడంలో ఇబ్బంది ఎదురుకావడమంటే.. ఏకాగ్రత లోపించడమే! అదే సమయంలో అనేక విషయాలు మస్తిష్కంలో మెదలడమే అందుకు ప్రధాన కారణం.

**దృశ్యీకరణ:** ఏదైనా విషయాన్ని గుర్తు చేసుకొనేందుకు సులభ విధానం దానిని దృశ్యీకరించుకోవడం. సమాచారానికి ఒక దృశ్య భావాన్ని జోడిస్తే అది బాగా గుర్తుండిపోతుంది. మస్తిష్క అరల్లోంచి ఎప్పుడంటే అప్పుడు సులభంగా బయటకు లాగవచ్చు.

ఏదైనా ఒక కొత్త విషయం మన దృష్టికి వచ్చినప్పుడు అంతకు ముందు ఎదురైన సరిగ్గా అలాంటి దానితో పోల్చుకోవాలి. అలా చేసినప్పుడు కొత్త విషయం ఎక్కువ రోజులు గుర్తుంటుంది. ఆ విషయానికి ఏదైనా దృశ్యం..జోక్..లేదా ఇష్టమైన శబ్దంతో మమేకం చేసుకున్నా మంచి ఫలితం సాధించవచ్చు.

**క్లుప్తీకరణలు:** ఇది అందరికీ తెలిసిన సాధారణ విషయం. ఉదాహరణకు 'నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్' అన్నది గుర్తుంచుకొనేందుకు 'నాసా'(ఎన్ఏసీఏ) మస్తిష్కంలో ఉంటే చాలు. ఇంకా విస్తృతంగా, ఏ సిద్ధాంతాన్నో గుర్తుంచుకోవాలంటే దానిలోని ఉప శీర్షికల ముందు అక్షరాలతో ఒక పదబంధం సృష్టించుకొంటే చాలు.

**పునఃశ్చరణ:** నిజానికి పునఃశ్చరణ మంచి సాధన. ఎవరికైనా సాధనతోనే పరిపక్వత వస్తుంది. పదే పదే ఒక విషయాన్ని పునఃశ్చరణ చేసుకోవడమంటే దానికి సంబంధించిన పునాదులను గట్టిగా నిర్మించుకోవడమేనని గ్రహించాలి.

**విభజన:** గుర్తుంచుకోవాల్సిన విషయాలను అంశాల వారీగా విభజించుకోవడం నిస్సందేహంగా ఉత్తమ ఫలితాలను అందిస్తుంది. పాఠశాల రోజులను గుర్తు చేసుకొంటే, ఎవరికి వారు తెలియకుండానే వివిధ సబ్జెక్టులను వేర్వేరుగా మనస్సులో నిక్షిప్తం చేసుకొనే విషయాన్ని గమనించవచ్చు.

**నాటకీయత:** ఏ అంశానికి అయినా ఒక నాటకీయత జోడిస్తే.. బాగా గుర్తుంటుంది. ఉదాహరణకు తిరుపతి లేదా యాదగిరి అనే పేరున్న వ్యక్తులు పరిచయం అవుతారు. అలాంటప్పుడు ఆయా ప్రాంతాలతో వారి ముఖాలను మానసిక అనుసంధానం చేసుకోవాలి. దానికదే భవిష్యత్‌లో వారిని చూడగానే గుర్తుపట్టడం సులువవుతుంది.

సినిమా చూస్తాం. అందులో ప్రతి విషయం మనకు గుర్తుంటుంది. అందులోని ప్రతి బిట్ మన స్నేహితులకు చెప్పగలుగుతాం. సరిగ్గా అదే ధోరణి అలవరుచుకుంటే ఏదైనా తేలికగా ఉంటుందని విజ్ఞులు సామాన్యంగా చెబుతుంటారు. ఎప్పుడైనా సరే, ఏదో ఒక్కటే చిట్కా అనుకోకూడదు. మనకు అనువైనది వీటిలో ఏదైనా ఎంచుకోవచ్చు. అవసరాన్ని బట్టి ఒకటికి రెండు జోడించి అమలు చేసుకోవచ్చు. అప్పుడు ఏదైనా జ్ఞాపకం ఉండి తీరుతుంది.

### వెబ్ వాచ్

# ఈజీ.. ఈజీ..ఆల్‌జీబ్రా

**'అ**ర్థం అయితే అంత ఈజీ మరేదీ లేదు; కాకుంటే మాత్రం బృహస్పతి అయినా బుర్ర గోక్కోవాల్సిందే' అనే నానుడిని బీజగణితానికి ఆపాదిస్తారు. విద్యార్థి దశలో అనేక మందికి బీజగణితం అనుభవాలు కలలో సైతం వెంటాడిన ఉదంతాలు కోకొల్లలు. అంకగణితాన్ని అలవోగ్గా లాగి అవతల పడేసే వారు సైతం ఆల్‌జీబ్రా వద్దకు రాగానే బోర్లాపడిపోతారు. ఆల్‌జీబ్రాను కాస్తా అరటిపండు ఒలిచిపెట్టినట్లుగా..చెప్పేవారుంటే ఎంత బాగుండు అని అనుకునే వారెందరో! అదిగో..సరిగ్గా అలాంటి వారి కోసమే ఒక వెబ్‌సైట్ ఉంది. దాని పేరు www.purplemath.com. ఈ పర్పుల్ మేథ్ వెబ్‌సైట్‌ను రూపొందించింది అమెరికాకు చెందిన ఒక ప్రొఫెసర్. వెస్టర్న్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో పని చేసే ఎలిజబెత్ స్టాపెల్ ఆధ్వర్యంలో వెబ్‌సైట్ రూపుదిద్దుకొంది. వెబ్‌సైట్‌లో ఉపయోగించిన భాష సులభంగా ఉండడం కలిసి వచ్చే అంశం. బీజగణిత లోతుపాతులను తడమాలనే విద్యార్థులకే కాదు; అధ్యాపకులకూ ఇది గొప్ప వనరు. ఆల్‌జీబ్రా గురించి ఏమాత్రం తెలియని సాధారణ వ్యక్తులు మొదలుకొని ఆ రంగంలో విశేష అనుభవాన్ని సాధించిన ఘనాపాఠీల వరకు ఉపయుక్తమయ్యే అంశాలను వెబ్‌సైట్ తనలో పొందుపరుచుకొంది.







సైట్‌లో థీమ్ కలర్‌గా 'పర్పుల్'(ఊదా)ను ఎన్నుకొన్నారు. ఫాంట్ కంటికి ఇంపుగా ఉంది. సైట్‌లో కంటెంట్‌ను మూడు విభాగాలుగా విభజించారు. అవి మెయిన్ పేజీ టెక్స్ట్ లింక్స్‌గా లభిస్తాయి. ప్రతి విభాగం నుంచి హోమ్‌పేజీకి సులభంగా మరలే వీలుంది. ప్రతి విభాగంలోనూ సెర్చ్ ఫీచర్ సిద్ధం.

అందులో ఉన్న ప్రతి అంశాన్ని అత్యంత సులభంగా తరగతి గదిలో బోధించేందుకు ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటే..ఆల్‌జీబ్రాలో వెనుకబాటుతనం ఉన్న విద్యార్థులకు కొంత బలాన్ని అందించేవిగా ఉంటాయి. వెబ్‌సైట్‌లోని 'పాఠ్యాంశాల' విభాగంలోకి ప్రవేశిస్తే.. ప్రిలిమినరీ, బిగినర్స్, అడ్వాన్స్‌డ్ లెవెల్‌లో కన్పిస్తాయి. అందులో చోటు చేసుకొన్న అంశాలకు 'లెక్కేలేదు'. నిరపేక్ష విలువ..బైనామినల్ థీరమ్ నుంచి క్వాడ్రాటిక్ సమీకరణల దాకా అన్నీ సులభంగా..సవివరంగా ప్రత్యక్షమవుతాయి.

ఏదేని ఒక ప్రత్యేకమైన అంశాన్ని మాత్రమే చూడాలని భావించే వారి కోసం ప్రతి పేజీలోనూ సెర్చ్ ఆప్షన్‌లున్నాయి. కేటగిరీల వారీగా మేథ్స్ హోం వర్క్ కోసం మార్గదర్శకాలు..అధ్యయన నైపుణ్యం కోసం సెల్ఫ్ సర్వేలు..ఉపయుక్తమయ్యే వివిధ వెబ్‌సైట్‌ల లింక్‌లతో www.purplemath.comను మలిచిన తీరు అద్భుతం. పరీక్షలకు సిద్ధం అయ్యే పాఠశాల విద్యార్థుల నుంచి పరిశోధకుల వరకు అందరి అవసరాలు తీర్చేలా రూపొందించిన ఎలిజబెత్ స్టాపెల్ నిజంగా అభినందనీయులు.

## ఇంటర్ డిసిప్లినరీ/ క్రాస్ డిసిప్లినరీ

○ **ఇంటర్‌డిసిప్లినరీ అలాగే క్రాస్‌డిసిప్లినరీ కోర్సులు అంటే ఏమిటి?**

**- పి. రాజశేఖర్, తణుకు, ప.గో.జిల్లా**

✎ రెండు లేదా మూడు అకడమిక్ డిసిప్లిన్‌ల మధ్య పరస్పర క్రియ (ఇంటరాక్షన్) సంబంధ అధ్యయనాన్ని ఇంటర్‌డిసిప్లినరీ కోర్సుగా చెప్పవచ్చు. వాస్తవానికి ఇలాంటి కోర్సులు చదివే వ్యక్తులకు ఒకటికి మించి ఎక్కువ డిసిప్లిన్‌లలో పరిజ్ఞానం ఉంటుంది. ఉదాహరణకు ఇండస్ట్రియల్ ఎకాలజీని తీసుకుంటే - సోషల్ సైన్సెస్, ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, టెక్నాలజీ, సిస్టమ్స్ థియరీ కలగలిసి ఉంటాయి. లైఫ్ సైన్సెస్‌లో రెండు దశాబ్దాలుగా ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్‌లు విజయవంతమవుతున్నాయి. బయో సైన్సెస్‌లో సంబంధిత పురోభివృద్ధే అందుకు కారణం. కొద్దిపాటి మినహాయింపులు తప్పిస్తే, మన దేశంలో ఇంటర్‌డిసిప్లినరీ ఎక్కువగా పీజీ స్థాయిలోనే ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వెబ్‌సైట్‌లను బ్రౌజ్ చేస్తే వీటిపై మరింత అవగాహన కలుగుతుంది. క్రాస్‌డిసిప్లినరీ అంటే ఒక సబ్జెక్టు హద్దులు దాటి ముందుకు సాగుతుంది. అది విదేశీ సబ్జెక్టు లేదా మెథడ్ కావచ్చు. సాహిత్యంలో రాజకీయాలు, సంగీతంలో ఫిజిక్స్ తదితరాలను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

## బ్యాంకింగ్ కెరీర్

○ **ఎంకాం చేస్తున్నాను. బ్యాంకింగ్ కెరీర్ కావాలనుకుంటే నేను ఏమి చేయాలి?**

**- కె. ప్రశాంతి, కనగల్, నల్లగొండ జిల్లా**

✎ ప్రభుత్వరంగ బ్యాంకులు తరచూ ప్రకటనలు జారీ చేసి ప్రొబేషనరీ అధికారులను తీసుకుంటున్నాయి. ఏ డిసిప్లెయిన్‌లోనైనా డిగ్రీ ఉత్తీర్ణులు సాధారణంగా ఈ పోస్టుకు అర్హులు. ఎస్‌బిఐ 65 శాతం, ఆర్‌బిఐ 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులు కావాలని అడుగుతున్నాయి. బ్యాంకులకు తోడు అకౌంటింగ్ అలాగే ఆడిటింగ్ సంస్థలు సైతం ఎంకాం చేసిన వ్యక్తులను ఆడిట్ ట్రైనీలుగా తీసుకుంటున్నాయి. బ్యాంకులు స్పెషలిస్టులంటూ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ రంగాలకుచెందిన వారినీ అధికారులుగా తీసుకుంటున్నాయి.

## బిపిఒకు పనికిరానా?

○ **నేను ఒక చిన్న పట్టణవాసిని. బిపిఒ లేదా సర్వీస్ సెక్టార్ అని నేను అనగానే, మిత్రులు నవ్వుతుంటారు. నేను ఇంగ్లిష్‌లో వీక్ అన్నది వారి అభిప్రాయం. ఇంగ్లిష్‌లో ప్రాథమిక పరిజ్ఞానంతో ఆ రెంటిలో చేరలేమంటారా?**

**- కె.తిమ్మప్ప, అనంతపురం**

✎ ఇంగ్లిష్ అంటే ఫ్యాన్సీ ఒకాబులరీ అవసరం లేదు. వినసొంపు ఉంటే సరిపోతుంది. తటస్థ స్థాయిలో ఇంగ్లిష్ మాట్లాడగలిగితే చాలు. మాతృభాషలో వ్యక్తమయ్యే యాస, ఇంగ్లిష్ మాట్లాడటంలో కనిపించకూడదు. ఆ మేరకు జాగ్రత్తలు పాటిస్తే అంతర్జాతీయ బిపిఒ సంస్థల్లో పని చేయవచ్చు. దేశీయ సంస్థలకు అంతకన్నా కొద్దిగా తక్కువ ఉన్నా సరిపోతుంది.

మరొక విషయం, బిపిఒ కంపెనీల వ్యూహం బాగా మారుతోంది. చిన్న పట్టణాల్లోని యువతకు అనుగుణంగా మారుతున్నారు. నగరాల్లోని ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో చదివే యువత కోసం ఇదివర్లో ఆరాటపడేవారు. బ్యాంకులు అలాగే కొన్ని బిపిఒ సంస్థలు ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారిని సైతం తీసుకుంటున్నాయి. ఉదాహరణకు - ఒక మోస్తరు పట్టణ, పల్లె ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నంలో ఐసిఐసిఐ బ్యాంక్ యత్నిస్తోంది. అందులో భాగంగా గ్రామీణ యువతను తీసుకుని తగు శిక్షణ ఇప్పించుకుంటోంది. బాగా ఇంగ్లిష్ మాట్లాడే వారు మాత్రమే కస్టమర్లకు మంచి సర్వీస్ ఇవ్వగలుగుతారనే ఆలోచనే తప్పు. ఇంగ్లిష్ మాట్లాడటం బాగారాని వారు సైతం ఈ రంగంలో బాగా ఇమిడిపోగలరు. ఈ కొత్త వ్యూహంతో ఆయా సంస్థలు ఉద్యోగం వదిలి వేరేచోటుకు పోయేవారి సంఖ్య (అట్రిషన్ రేటు)ను తగ్గించుకునే యత్నం చేస్తున్నాయి. మరోపక్క గ్రామీణ యువతకు ఉపాధి కల్పించే యత్నాలకూ పూనుకుంటున్నాయి. విప్రో వంటి పెద్ద కంపెనీలు గ్రాడ్యుయేట్లను తీసుకునే పనిలో పడ్డాయి. ఈ ఎత్తుగడతో, విశ్వాసంతో పని చేసే సిబ్బందిని సమకూర్చుకోవచ్చని ఆయా కంపెనీలు భావిస్తుండటం గమనార్హం.

**- గోవర్ధనం కిరణ్‌కుమార్**

### వివరాలు ఇవిగో



చిరునామా: **వివరాలు ఇవిగో**, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033